అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాల పరిశీలన

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, డిసెంబర్ 14 : గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను అదేశించారు. గురువారం ఆయన పలు పథకాల నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్మార్ట్‌సిటికి చెందిన రూ. 70 కోట్లతో చేపట్టిన భద్రకాళీ బండ్ సుందరీకరణ, పాత్‌వే, సైకిల్ ట్రాక్, గజిబో గ్రీనరీ పనులను పరిశీలించారు. అజర దవాఖాన వద్ద నిర్మిస్తున్న టూ వెంట్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. నయీంనగర్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కల్వర్ట్ పరిశీలించి నేషనల్ హైవే అధికారులతో కలిసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. రూ. 3కోట్లతో జవహర్‌నగర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని అదేశించారు. హనుమకొండలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఖాజీపేట నిట్ జంక్షన్ విస్తరణ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను అదేశించారు. పురోగతిలో ఉన్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్‌వో రమేశ్, స్మార్ట్‌సిటీ ప్రతినిధి వీ ఆనంద్, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, ఏఈలు కార్తీక్ రెడ్డి, హరికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీఏఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వివేకానంద

వర్ధన్నపేట, డిసెంబర్ 14 : తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బండౌతాపురం గ్రామానికి చెందిన తాటికాయల వివేకానందను నియమించినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో క్రియాశీలంగా పనిచేస్తున్న వివేకానందను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే తన నియామకానికి సహకరించినవారికి వివేకానంద ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14: పరిసరాల పరిశుభ్రత పాటించాలని కేయూ ఫార్మసీ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సూచించారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సునీత, శశిధర్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓగా వజీర్ సుల్తాన్ బాధ్యతల స్వీకరణ

సుబేదారి, డిసెంబర్14 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన సీఈఓగా వజీర్ సుల్తాన్ బాధ్యతలు స్వీకరించారు. యూనియన్ బ్యాంక్‌లో 30 ఏళ్లుగా పనిచేసిన ఆయన అక్టోబర్‌లో హైదరాబాద్ టెస్కాబ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో వరంగల్ డీసీసీబీ సీఈఓగా ఎంపికయ్యారు. ఆయన గురువారం హనుమకొండ అదాలత్‌లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పాలక వర్గ సభ్యులు, ఉద్యోగులు కొత్త సీఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సుబేదారి, డిసెంబర్ 14: హనుమకొండ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13మందికి రూ.17,700 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ.2400 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

17న త్రినగర ఐక్య మెగా క్రిస్మస్ వేడుకలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14: ఈనెల 17న సాయంత్రం ఫాతిమానగర్‌లోని అద్భుత అంథోని దేవాలయంలో 11వ త్రినగర ఐక్యమెగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు చైర్మన్ బిషప్ కే డేనియల్, కోచైర్మన్ ఉడుముల బాల తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకలకు వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని అన్ని క్రైస్తవ సంఘాలు, బిషప్‌లు, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొని ప్రార్థిస్తారని తెలిపారు. పాటల పోటీలు, కొరియోగ్రఫీ, క్విజ్, నృత్యం తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. బిషప్‌లు మార్కండేయ, జాన్ మార్క్, జీ కమల్, జీ అనుకిరణ్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న క్రైస్తవ మత పెద్దలు

సోమిడిలో మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన

కాజీపేట, డిసెంబర్ 14: కాజీపేట పట్టణం 62వ డివిజన్‌లోని సోమిడిలో నేటి (శుక్రవారం) నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు సీతాలమ్మ సమేత మడేలయ్య సహిత ఈరమ్మ తల్లి దేవతల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సోమేశ్వర రజక సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాలడుగుల మనోహర్, శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో రజక కుల దైవాల విగ్రహాలను పాలడుగుల రమాదేవి– శివకుమార్ దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బీ సారయ్య, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, కాంట్రాక్టర్ బోళ్ల కుమారస్వామి రానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాలడుగుల కుమార్, రమేశ్ బాబు, హరికిషన్, ఉపేందర్, రామస్వామి, సదానందం, సుధాకర్, రవి, రమేశ్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలి

గ్రేటర్ అదనపు కమిషనర్ రషీద్

వరంగల్, డిసెంబర్ 14 : నిర్దేశిత లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలని గ్రేటర్ అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం స్వానిధి పథకంలో లక్ష్యం చేరుకొని గ్రేటర్ వరంగల్ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పథకం కొనసాగింపుగా మరో 6 వేల మంది చిరు వ్యాపారస్తులకు రుణాలందించాలన్నారు. ఈ నెల చివరిలోగా మహిళా పొదుపు సంఘాలకు లింకేజీలు పూర్తి చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మెప్మా టౌన్ ప్రాజెక్ట్ అధికారి కోలా రాజేశ్‌గౌడ్, ఎల్‌డీఎం హవేలి రాజు, డీపీఎంలు అనిత, సరిత, డీఎంసీ రేణుక, టీఎంసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు

పర్వతగిరి, డిసెంబర్ 14: మండలంలోని చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల్లో గురువారం హెల్త్ క్యాంపులు నిర్వహించారు. గ్రామంలో లేబర్ కార్డులు కలిగి ఉన్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సర్పంచ్‌లు గటిక సుష్మా మహేశ్, సంధ్యారాణి, ఎంపీటీసీలు సుభాషిణి, మౌనిక, కోల మల్లయ్య, ఉప సర్పంచ్ పెండ్లి రమేశ్, నర్సింగం, సతీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలి

హసన్‌పర్తి, డిసెంబర్ 14 : తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులతో గొడవపడి బుధవారం సాయంత్రం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు మండల కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ శిక్షణా కేంద్రం ఎదుట కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆ యువతి తండ్రితో మాట్లాడారు. తాను ప్రేమించిన వ్యక్తిని వారి తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి హసన్‌పర్తి నుంచి తీసుకుపోయారని ఆరోపిస్తుంది. ప్రేమించిన వ్యక్తికి వెతికి పట్టుకొని తీసుకు వస్తామని మహిళకు పోలీసులు నచ్చజెప్పడంతో ఆమె శాంతించి ఇంటికి వెళ్లిపోయింది.

జ్యూట్ బ్యాగుల తయారీతో ఆర్థికంగా ఎదగాలి

నాబార్డు డీడీఎం ఎల్ చంద్రశేఖర్

వేలేరు, డిసెంబర్ 14 : జ్యూట్ బ్యాగుల తయారీతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాబార్డు డీడీఎం ఎల్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని పీచర గ్రామంలోని రైతువేదికలో సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో గ్రామంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు 30మందికి జ్యూట్ బ్యాగుల తయారీపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జ్యూట్ బ్యాగ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. మహిళలు జ్యూట్ బ్యాగ్‌ల తయారీ ద్వారా లంచ్ బ్యాగులు, క్యారీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ కవర్లు, ఆఫీస్ బ్యాగులు వంటి వివిధ రకాలైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. 15రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్లు శ్రీనివాస్, అక్తరున్నీసా, ఏఈవో బాబు, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొత్తపల్లి పెద్దమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న అరూరి రమేశ్

దేవాలయాలతో మానసిక ప్రశాంతత

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్

వర్ధన్నపేట, డిసెంబర్ 14 : దేవాలయాలతో మానసిక ప్రశాంతంత నెలకొంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అరూరి రమేశ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అరూరిని ముదిరాజ్ కులస్తులు అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, ముదిరాజ్ సంఘం నాయకుడు చొప్పరి సోమయ్య, శుభనందిని రాంబాబు, ముదిరాజ్ కుల సంఘం పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

ఎల్బీ కాలేజీలో 'అంతర్జాతీయ మినరల్స్ ఇయర్'

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14: లాల్ బహదూర్ కాలేజీలో ఎన్సీసీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మినరల్స్ ఇయర్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ప్రపంచంలో నేడు మిల్లెట్స్ (మినరల్స్) ప్రాధాన్యం గుర్తించిన ప్రపంచ దేశాలు 2023– 24 సంవత్సరాన్ని అంతర్జాతీయ మినరల్స్ డే నిర్వహిస్తున్నట్లు అరుణ తెలిపారు. ఈ సందర్భంగా 9 నుంచి 14 డిసెంబర్ వరకు చైతన్య ర్యాలీలు, ప్రత్యేక ఉపన్యాసాలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వంటలు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ సదానందం, వైస్ ప్రిన్సిపాల్ కే రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు సీహెచ్ రవీందర్, వీ మధుకర్‌రావు, డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, అజ్జల్, శ్రీనివాస్, రాము, విద్య, రజినీకాంత్, భాగ్యలక్ష్మి, హాస్య, శివాని, నాగరాజు, నౌషిన్, రేణుక, సంతోష్, ప్రదీప్ కుమార్, ఎన్సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

అప్రెంటిస్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ సిటీ, డిసెంబర్ 14 : ఇంటర్ ఒకేషనల్ విద్యలో 2021 నుంచి 2023 మధ్యలో పారా మెడికల్ పూర్తిచేసిన విద్యార్థినుల నుంచి అప్రెంటిస్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యా శాఖ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండలోని మిషన్ దవాఖాన, పరకాల పిహెచ్‌సీ కోసం దరఖాస్తులను డీఐఈఓ కార్యాలయంలో ఈనెల 30 సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు. సీకేఎం, ఎంజీఎం దవాఖాన కోసం వరంగల్ డీఐఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఐనవోలు, డిసెంబర్ 14: ఉరి వేసుకొని వివాహిత ఆత్యహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా రామచంద్రపురంనకు చెందిన హారిక(19) మండల కేంద్రానికి చెందిన అలుగునూరి నాగరాజు 8 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్న రోజులుగా భర్త నాగరాజు కట్నం కోసం వేధించసాగాడు. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి వాసానికి ఉరి వేసుకొని మృతి చెందింది. హారిక తండ్రి చీకట్ల కుమారస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మడికొండలో ర్యాలీ తీస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతలు

అయోధ్య రాముడి పూజిత అక్షిత ర్యాలీ

మడికొండ/కాజీపేట, డిసెంబర్ 14: అయోధ్య శ్రీరామా మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నగరానికి వచ్చిన శ్రీరాముడి పూజిత అక్షితల కలశాలకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం మడికొండ, మెట్టుగుట్ట నుంచి స్వాగత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీతారామ చంద్రస్వామి ఆలయంలో అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మడికొండ, కాజీపేటలో భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ వరంగల్ మహా నగర కార్యదర్శి శ్రీరాము ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు వెలగందుల రాజు, సహ కార్యదర్శి సందీప్ రెడ్డి, బజరంగ్‌దళ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సాయికుమార్, మహానగర్ జిల్లా కన్వీనర్ రోహిత్, కో కన్వీనర్ హరీశ్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు రూపిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రావుల కిషన్ పాల్గొన్నారు.